# 53

# యేసు తన శత్రువులకు సమాధానమిచ్చుట

## (22:15-46)

ఈ అధ్యాయము అనేక సంఘర్షణలను వివరించుచున్నది, ఆ యా సంఘర్షణలలో యేసు విరోధులు ఆయనను అప్రతిష్ఠపాలుజేయుటకు ఎలా ప్రయత్నించారో తెలియును. ఈ ప్రత్యర్థులలో పరిసయ్యులు మరియు హేరోదీయులు (22:15-22), సద్దూకయ్యులు (22:23-33), మరియు ఒక పరిసయ్యుడైన ధర్మశాస్త్రోపదేశకుడు (22:34-40) చేరియుండిరి. యేసు పరిసయ్యులను "క్రీస్తు"ను గూర్చి అడిగిన ప్రశ్నతో, వారి నోరు మూయింపబడుటతో ఈ అధ్యాయం ముగియుచున్నది (22:41-46).

### పన్ను చెల్లించుట గూర్చిన ప్రశ్న (22:15-22)

**15అప్పుడు పరిసయ్యులు వెళ్లి, మాటలలో ఆయనను చిక్కుపరచవలెనని ఆలోచనచేయుచు**
**16-బోధకుడా, నీవు సత్యవంతుడవై యుండి, దేవుని మార్గము సత్యముగా బోధించుచున్నావనియు, నీవు ఎవనిని లక్ష్యపెట్టవనియు, మోమాటము లేనివాడవనియు ఎరుగుదుము.**
**17నీకేమి తోచుచున్నది? కైసరుకు పన్నిచ్చుట న్యాయమా? కాదా? మాతో చెప్పుమని అడుగుటకు హేరోదీయులతో కూడ తమ శిష్యులను ఆయనయొద్దకు పంపిరి.**
**18యేసు వారి చెడుతనమెరిగి-వేషధారులారా, నన్నెందుకు శోధించుచున్నారు?**
**19పన్నురూక యొకటి నాకు చూపుడని వారితో చెప్పగా వారాయనయొద్దకు ఒక దేనారము తెచ్చిరి.**
**20అప్పుడాయన-ఈ రూపమును పైవ్రాతయు ఎవరివని వారినడుగగా వారు-కైసరువనిరి.**
**21అందుకాయన ఆలాగైతే కైసరువి కైసరునకును, దేవునివి దేవునికిని చెల్లించుడని వారితో చెప్పెను.**
**22వారీమాట విని ఆశ్చర్యపడి ఆయనను విడిచి వెళ్లిపోయిరి.**

**వచనము 15.** యేసును వ్యతిరేకించుచుండిన వారిలో పెద్ద నోరున్న పెద్ద మనుష్యులు, **పరిసయ్యులు** (3:7; 15:1పై గల వ్యాఖ్యానము చూడు). వారికిని యేసునకును మధ్య నుండిన తీవ్రమైన అభిప్రాయభేదములు మతసంబంధమైన సంగతులకు సంబంధించినవై యున్నవి (9:11, 34; 12:2, 24, 38; 15:1, 2; 16:1; 19:3). ఈ సమయములో, యేసు బోధించుచుండిన ఉపమానములలో ఆయన వారి గూర్చి ప్రస్తావించుచుండెనని పరిసయ్యులు అర్థంచేసికొన్నారు, గనుక వారు మనస్సులో నొచ్చుకొన్నారు (21:45). అయితే అందుకు వారు ప్రజలకు భయపడుచు ఆయనను బహిరంగముగా పట్టుకొనజాలకపోయినప్పటికిని (21:46), వారు ఆయన యొద్ద నుండి వెళ్లిపోయి **ఆయన చెప్పుచుండిన విషయాలలోనే ఆయనను ఏలాగు చిక్కుపరచవలెనా** యని అందురు కలిసి కుట్ర చేయుచుండిరి.

**వచనము 16.** వారి యెదుట ఉండిన యేసును ప్రత్యక్షంగా ఎదుర్కొనుటకు బదులుగా, పరిసయ్యులు **తమ శిష్యులను ఆయన యొద్దకు పంపిరి.** పరిసయ్యుడై యుండిన గమలీయేలు యొద్ద, పౌలు ఎలా ఒక విద్యార్థియై యుండెనో (అపొస్తలుల కార్యములు

5:34; 22:3), ఆలాగే వీరు కూడ ఈ పరిసయ్యుల యొద్ద పాఠాలు నేర్చుకొనుచుండిన విద్యార్థులై యుండిరి. అటుతరువాత, యేసు వారి శిష్యులను మరియు సద్దూకయ్యుల నోరు మూయించినప్పుడు, ఎలాగైనా సరే యేసును ముఖాముఖిగా ఎదుర్కొనుటయే ముఖ్యమని పరిసయ్యులు తీర్మానించుకొన్నారు (22:34).

యేసుతో ఘర్షణ పడుటకు ఆయన యొద్దకు వచ్చిన పరిసయ్యుల శిష్యులతో **హేరోదీయులు** కూడ కలిసిపోయారు. పరిసయ్యులు మరియు హేరోదీయులు సహజ శత్రువులై యుండిరి, ఏలయనగా హేరోదీయులు హేరోదు రాజుల పరిపాలనకు గట్టి మద్దత్తు నిచ్చుచుండిరి.[1] అట్లయినను, వారు తమ సమష్టి శత్రువును – యేసును ఎదుర్కొనుటకు ఒక్కటయ్యారు.[2] ఒక పూరాతనమైన మధ్య తూర్పుదేశ లోకోక్తి ఇచ్చట చక్కగా వర్తిస్తుంది: “నా శత్రువు యొక్క శత్రువు, నాకు స్నేహితుడు.”

హేరోదీయులు మతపరమైన వర్గము కాదు, గనుక వారు సక్రమంగా ఏర్పడిన ఒక రాజకీయ పక్షము కాకపోవచ్చును. ఈ సమయంలో, వారు హేరోదు అంతిపయకు, అనగా రోమనుల చేత నియామకము చేయబడి, గలిలయ మరియు పెరియ ప్రాంతములను పరిపాలించుచుండిన రాజుకు, మద్దతు పలుకుచుండినవారై యుందురు. హేరోదీయులకు ప్రత్యక్ష ప్రతిపక్షముగా జెలోతీయులుండిరి. వీరు రాజకీయపరంగాను, తరుచుగా సైనికపరంగాను, చురుకైన కార్యకర్తలై యుండిరి. అత్యంత తీవ్రమైన జాతీయవాదులై యుండిన ఈ యూదులు, రోమనులు వాగ్దాన దేశమును ఆక్రమించుకొనుటను నిరసించారు. యేసు శిష్యులలో ఒకడు, సీమోను, ఈ వర్గమునకు చెందినవాడై యుండెను (లూకా 6:15).

ముఖస్తుతి చేయుట గ్రీకు – రోమా ప్రపంచంలో ఒక దురలవాటుగా పరిగణించబడింది.[3] ఏది ఏమైనా, యేసును చిక్కుపర్చుటకు వారు ఈ విధానమును ఆయనపై అకస్మాతుగా ప్రయోగించునట్లు ప్రయత్నించకుండా ఈ అలవాటు పరిసయ్యుల శిష్యులను మరియు హేరోదీయులను నిరోధించలేదు. ఆయనను **బోధకుడా!** అని సంబోధించిన పిదప, ఆయన **సత్యవంతుడై** యున్నాడు – అనగా, “నిజాయితీపరుడు” (NJB) లేక “నీతి నిజాయితీగల మనిషి” (NIV) – అను వారి ఆత్మవిశ్వాసమును వ్యక్తము చేసారు. యేసు, **దేవుని మార్గము సత్యముగా** బోధించాడని వారన్నారు. యేసు ఎవనిని **లక్ష్యపెట్టడు**; ఎవని యెడలను **మోమాటము లేనివాడు** అని పలుకుచు వారి ముఖస్తుతిని ముగించారు. “నీవు ఎవరి పైరూపమునైనను లక్ష్యపెట్టవు” అని అక్షరాలా గ్రీకు గ్రంథ పాఠము చెప్పుచున్నది.

ఈ వచనములో వ్రాయబడి యున్నట్లు యేసు శత్రువులైనవారు చెప్పినదంతయును నిజమే. స్పష్టముగా వారేమి చెప్పుచుండిరో దానిని వారు నమ్మలేదు, లేదంటే వారు ఆయనను వెంబడించేవారే. దానికి మారుగా, వారు కేవలము ఆయనను చిక్కుపర్చుటకే ఈ ప్రకటనలు చేసారు.

**వచనము 17.** ఆ తరువాత, **కైసరుకు పన్ను ఇచ్చుట న్యాయమా? కాదా? మాతో చెప్పుము** అని వారు యేసును ప్రశ్నించారు. “న్యాయమా?” అను పదము “సరైనదేనా” (NIV) లేక “అనుమతింపదగినదేనా” (NJB) అని కూడ అనువదింపబడవచ్చును. కైసరుకు పన్ను ఇచ్చుటకు ధర్మశాస్త్రము అధికారపూర్వక అనుమతినిచ్చుచున్నదా లేదా అని వారడుగుచుండిరి. “రోమా చక్రవర్తికి పన్ను ఇచ్చుటను యూదుల ధర్మశాస్త్రము [తోరా]

అనుమతించుచున్నదా లేదా?" అని JNT బైబిల్‌లో వ్రాయబడి యున్నది.

యేసు, "ఔను" అని చెప్పినా, "లేదు" అని చెప్పినా ఇది ఆయనకు సమస్యను సృష్టించగల ఒక ప్రశ్నయై యుండింది. ఆయన "లేదు" అని చెప్పినట్లయితే, హేరోదీయులు ఈ విషయాన్ని ఆయన మీద ఒక నేరముగా మోపుచు రోమా ప్రభుత్వాధికారులకు తెలియజెప్పుదురు, అప్పుడు ఆయన రాజద్రోహి యని చంపబడును (చూడు లూకా 23:2). ఆయన "ఔను" అని చెప్పినట్లయితే, పరిసయ్యులు ఆయనను యూదా ప్రజల ముందర బహిరంగముగా నిందించుచు శాపనార్థాలు పెట్టుదురు. వారిలో అధిక సంఖ్యాకులు అత్యాగ్రహము నొందుదురు ఏలయనగా వారి దేశమును అక్రమంగా ఆక్రమించుకొనిన రోమనులను వారు ద్వేషించుచుండిరి.

"పన్ను" (ప్రతి వ్యక్తి మీద విధింపబడే పన్ను – పోల్ ట్యాక్స్ – *kēnsos*) ప్రతి సంవత్సరము, ఆక్రమిత భూభాగములలో నివసించుచు, పదునాలుగు సంవత్సరములు మొదలుకొని అరువది ఐదు సంవత్సరముల వయస్సున్న ప్రతి పురుషునిపై విధింపబడుచుండినది. ఈ హేతువునుబట్టియే రోమా పట్టణము కాలక్రమముగా ప్రజా సంఖ్య వ్రాయబడవలసిన ఏర్పాటు చేసింది (చూడు లూకా 2:1–4). రోమా ప్రభుత్వము చేత యూదులపై విధింపబడిన వ్యక్తిగత పన్ను నిరసింపబడుట కంటె ఎక్కువగా ఇతరమైన ఏ పన్నైను నిరసింపబడలేదు. పాలస్తీనా దేశమును పరిపాలించు సర్వహక్కులు రోమా ప్రభుత్వమునకే కలవను విషయమును ఈ విధానము నొక్కివక్కాణించినది. ఈ పన్నును పరిసయ్యులు వ్యతిరేకించారు ఏలయనగా దేవుడే ఇశ్రాయేలును ఏలుబడి చేయు రాజై యుండెను, గనుక వారిని ఒక పరదేశి పరిపాలించునట్లు వారు అనుమతించుటను ఆయన నిషేధించాడు (ద్వితీయోపదేశ కాండము 17:14, 15). జాక్ పి. లూయిస్ ఇలా వ్రాయుచున్నాడు, "పన్ను ఇచ్చుట మోషే ధర్మశాస్త్రము పాటింపబడు ప్రకారమైనదై యున్నదా లేదా అను ప్రశ్న, హేరోదు రాజు అధికారము లోనికి వచ్చినది మొదలుకొని యూదా దేశము పతనమగునంత వరకు, తీవ్రమైన ఆవేశం కలిగించుచుండిన సమస్యయై యుండినది, సరికదా గనుకనే అది క్రీ.శ. 132–135లో బార్ కోఖ్బా తిరుగుబాటును పురికొల్పినది."[4] క్రీ.శ. 6లో, యేసు బాలుడై యుండిన రోజుల్లో, ఈ పన్ను విధానమునకు వ్యతిరేకముగా గలిలయవాడైన యూదా ఒక తిరుగుబాటును లేవదీసాడు (అపొస్తలుల కార్యములు 5:37).[5]

**వచనము 18.** ఈ మనుష్యుల మనస్సుల్లో ఏముండినదో **యేసు** ఎరిగియుండెను (యోహాను 2:24, 25) గనుక వారు అడుగుచుండిన ప్రశ్న వెనుక వారి ఆలోచన ఏమై యుండినదో కూడ ఆయన ఎరిగియుండెను. వారు ఆయనను "శోధించుచుండిరని" లేక **పరీక్షించుచుండిరని** ఆయన ఎరిగియుండెను (4:1; 16:1పై గల వ్యాఖ్యానము చూడు). వారనుకొన్నట్లుగా, వారడిగిన ప్రశ్నకు సామాన్యమైన ఒక సమాధానము నిచ్చుటకు బదులుగా, ఆయన వారిని **వేషధారులారా** అంటూ వారిని బహిరంగముగా నిందించాడు (6:2, 5 పైగల వ్యాఖ్యానము చూడు). యేసు వంచింపబడలేకపోయాడు. వారి కుయుక్తి ఆయనకు ఎరుకే అని వారు తెలిసికొనునట్లు ప్రవర్తించాడు. వారడిగిన ప్రశ్న సత్యమును అన్వేషిస్తూ అడిగినది కాదు కానీ కేవలము ఆయనను చిక్కుపర్చుటకు చేయబడిన ప్రయత్నము మాత్రమే అని ఆయన తెలిసికొని యుండెను.

**వచనము 19.** యేసు, **పన్ను రూక ఒకటి నాకు చూపుడి** అని వారినడిగాడు. "రూక" (నాణెము) అని అర్థమిచ్చు గ్రీకు పదము (*nomisma*) సమస్త జనుల చేత ఉపయోగించబడు ద్రవ్యమును సూచించుచున్నది. ఆ రోజుల్లో, ఇశ్రాయేలు దేశంలో అనేక వేర్వేరు రకములైన నాణెములు ఉపయోగింపబడుచుండగా, ఈ పన్ను కట్టుటకు ప్రజలంతా రోమా దేశ **దేనారమును** మాత్రమే వాడవలసి యుండినది. వారు ఒక వెండి రూకను యేసు యెదుటికి తెచ్చుటకు పరిసయ్యుల చేత పంపబడిన శిష్యులకు మరియు హేరోదీయులకు కష్టమేమీ కలుగలేదు. దేనారము, ఒక దిన కూలి మొత్తమునకు సమానమైనదై యుండినది (20:2) గనుక,అది సర్వసామాన్యమైన సంగతై యుండినది.

**వచనము 20.** యేసు ఆ దేనారమును తీసికొని, బహుశా అందరికి కనబడునట్లు దానిని పైకి ఎత్తియుండును, **ఈ రూపమును పైవ్రాతయు ఎవరివి?** అని వారిని ప్రశ్నించాడు. యేసు చేతిలో ఉండిన రూక పైరూపము ఔగుస్తు రాజుదా (క్రీ.పూ. 31-క్రీ.శ.14) లేక, రాజైన తిబెరియదా (క్రీ.శ. 14-37) అనునది ఖచ్చితంగా తెలియుటలేదు. తొలి "కైసరు" "గాయు జూలియస్ కైసరు" అయియుండెను. "జూలియస్" అను నామము వారి కుటుంబ పేరై యుండెను, మరియు "కైసరు" అను నామము మారుపేరై యుండెను. ఈ ప్రకారంగా ఉపయోగింపబడిన క్రమములో, (1) పెట్టబడిన పేరు, (2) కుటుంబము పేరు, మరియు (3) మారుపేరు కలవు.[6] "కైసరు" అను పేరు వాస్తవమునకు మొదట్లో జూలియస్ కైసరు యొక్క మారుపేరై యుండినది, ఈ పేరు అటుతరువాత రోమా చక్రవర్తులకు ఒక బిరుదయ్యింది. క్రొత్త నిబంధనలో అనేకులు "కైసరు" అని ప్రస్తావింపబడి యున్నారు. వారిలో ఔగుస్తు (లూకా 2:1), తిబెరి (లూకా 3:1), క్లౌదియ (అపొస్తలుల కార్యములు 17:7; 18:2), మరియు నీరో (అపొస్తలుల కార్యములు 25:8-12; ఫిలిప్పీయులకు 4:22) ఉన్నారు. యేసు పుట్టినప్పుడు ఔగుస్తు పరిపాలన చేయుచుండిన చక్రవర్తియై యుండెను, గనుక పాత దేనారము పై ఆయన రూపము ఉండియుండును. అయితే యేసు పరిచర్య చేయుచుండిన కాలములో దేశమును పరిపాలించుచుండిన చక్రవర్తి తిబెరి అయియుండెను, గనుక ఆ రోజుల్లో చెలామణిలో ఉండిన రూక అతని రూపము కలిగియుండెను.

మనము చర్చించుచున్న ఈ సందర్భమునకు చక్రవర్తియైన తిబెరి ఏలుబడిలోని దేనారము ఎక్కువ సముచితమైనదై యుండును, ఏలయనగా ఆ రోజుల్లో యూదులపై పన్ను విధించుచుండినవాడు అతడే. ఎవరెట్ ఫెర్గూసన్ ఈ రూకలలోని ఒక నమూనాను సూచించాడు, దాని ముఖభాగములో గుండ్రని మాలికతో అలంకరింపబడిన చక్రవర్తిగారి తల ఉండినది మరియు దాని పైవ్రాతలో "దైవికమైన ఔగుస్తు కుమారుడు, తిబెరి కైసరు ఔగుస్తు" అని ఉండినది వెనుక భాగం, కూర్చుండియున్న ఒక స్త్రీని, సాధారణంగా లివియ అని గుర్తింపబడిన తిబెరి తల్లిని చిత్రీకరించినది, ఈమె రోమన్‌ల పరిపాలన వలన ఏర్పడిన శాంతి దేవతను సూచింపవచ్చును. దానితో కూడ "ప్రధాన యాజకుడు" అని చెక్కబడియుండిన పైవ్రాత ఉండింది.[7]

**వచనము 21.** పైరూపము మరియు పైవ్రాత **కైసరువని** ప్రజలు సరిగ్గా గుర్తించినప్పుడు, యేసు, **అలాగైతే కైసరువి కైసరునకును, దేవునివి దేవునికిని చెల్లించుడని** వారితో చెప్పాడు. రూక ఔగుస్తు చేత జారీచేయబడి, అతని రూపమును మరియు పైవ్రాతను కలిగియున్నది గనుక, దానిని తిరిగి అతనికి ఇచ్చుటయే న్యాయసమ్మతమని యేసు

తర్కించుచుండెను. “చెల్లించుడి” (*apodidōmi*) అను క్రియా పదము, చెల్లింపబడుటకు రుణపడియున్న దానిని ఇచ్చివేయుట యను అవగాహనను కనుపర్చుచున్నది.[8] ఇది 17వ వచనములో నున్న “ఇచ్చుట” (*didōmi*) కంటె ఎక్కువ బలమైన పదమై యున్నది. యేసును ప్రశ్నించుచుండినవారు కైసరు రూకలను ఉపయోగించుకొంచుండిరను వాస్తవమే వారు కైసరుకు పన్ను చెల్లింపవలసినవారై యున్నారని వారు ఒప్పుకొన్నట్లే, అంటూ లియోన్ మోర్రిస్ ఈ విషయాన్ని ప్రస్తుత వాదానికి ప్రాతిపదికగా అంగీకరించాడు.[9] ఈ సందేశము ముఖ్యముగా పన్ను చెల్లించకుండా ఎగరవేయుటకు ప్రయత్నించుచుండిన పరిసయ్యులకు సముచితమైనదై యుండినది.[10]

**దేవునివి దేవునికి చెల్లించుడని** యేసు వారితో చెప్పాడు. రూకల పైరూపము మరియు పైవ్రాతనుబట్టి కైసరునకు విగ్రహారాధన చేయబడవలెనను సాధికార ప్రకటనలకు ఆయన తన ఆమోద ముద్రను వేయుచుండలేదు; ఏలయనగా దైవికమైన గౌరవము మరియు ఆరాధనకు దేవుడు మాత్రమే అర్హుడు (4:10; చూడు దానియేలు 4:28–37; అపొస్తలుల కార్యములు 12:20–23). ఈ విశాల విశ్వమంతటిని నిత్యత్వము వరకు దేవుడే ఏలుచుండును, అయితే చక్రవర్తులంతా రోమా సామ్రాజ్యమును కొంత కాలము పరిపాలించిన మానవ అధికారులై యున్నారు. ప్రభుత్వమునకు ఒక సమయము, సందర్భము ఉన్నది, గనుక అది పన్నుల ద్వారా తనను తాను పోషించుకొనుట దానికి తగినదే అను తన ధ్వనింపును యేసు బయటపెట్టుచుండెను, ప్రతి మానవుడు దేవునికి ఋణపడియున్నాడని కూడా ఆయన భావించుచుండెను. మానవులు దేవుని రూపము కలిగియున్నందు వలన (ఆదికాండము 1:27; 5:1), వారి జీవితములనే వారు ఆయనకు సమర్పించుకొనుటకు ఋణపడియున్నారు (రోమీయులకు 12:1, 2). ఈ సందేశము ముఖ్యముగా లౌకిక సంబంధులైన హేరోదీయులు వినవలసిన అవసరం ఎంతైన ఉండినది.

**వచనము 22.** యేసును ప్రశ్నించిన వారు జ్ఞానముతో కూడిన ఆయన సమాధానమునకు **ఆశ్చర్యపడ్డారు**. రోమా అధికారుల నుండి గాని లేదా యూదుల జనసమూహముల నుండి గాని ఎటువంటి వైరమునైనను పురికొల్పకుండానే, ఆయన తన సత్యసంధత్వముతో ప్రతిస్పందించాడు. తమ్మును తాము అంత కంటె ఎక్కువ సిగ్గుచేటైన సంఘర్షణప్రజల ముందు బయటపెట్టుకొనక మునుపే వారు ఆ స్థలమును చాకచక్యముగా విడిచి వెళ్లిపోవలెనని పరిసయ్యులు పంపిన శిష్యులు మరియు హేరోదీయులు ఎంతో వివేకంతో తీర్మానించుకొన్నారు.

### పునరుత్థానము గూర్చిన ప్రశ్న (22:23–33)

**23పునరుత్థానము లేదని చెప్పెడి సద్దూకయ్యులు ఆ దినమున ఆయనయొద్దకు వచ్చి 24–బోధకుడా, ఒకడు పిల్లలులేక చనిపోయిన యెడల అతని సహోదరుడు అతని భార్యను పెండ్లిచేసికొని తన సహోదరునికి సంతానము కలుగజేయవలెనని మోషే చెప్పెను; 25మాలో ఏడుగురు సహోదరులుండిరి; మొదటి వాడు పెండ్లిచేసికొని చనిపోయెను; అతనికి సంతానము లేనందున అతని సహోదరుడు అతని భార్యను తీసికొనెను. 26రెండవ వాడును మూడవ వాడును ఏడవ వానివరకు అందరును ఆలాగే జరిగించి చనిపోయిరి.**

**27-28అందరి వెనుక ఆ స్త్రీయు చనిపోయెను. పునరుత్థానమందు ఈ యేడుగురిలో ఆమె ఎవనికి భార్యగా ఉండును? ఆమె వీరందరికిని భార్యగా ఉండెను గదా అని ఆయనను అడిగిరి. 29అందుకు యేసు-లేఖనములను గాని దేవుని శక్తినిగాని ఎరుగక మీరు పొరబడుచున్నారు. 30పునరుత్థానమందు ఎవరును పెండ్లిచేసికొనరు, పెండ్లికియ్యబడరు; వారు పరలోకమందున్న దూతలవలె ఉందురు. 31-32మృతుల పునరుత్థానమునుగూర్చి- నేను అబ్రాహాము దేవుడను, ఇస్సాకు దేవుడను, యాకోబు దేవుడనై యున్నానని దేవుడు మీతో చెప్పినమాట మీరు చదువలేదా? 33ఆయన సజీవులకే దేవుడు గాని మృతులకు దేవుడు కాడని వారితో చెప్పెను. జనులది విని ఆయన బోధకాశ్చర్యపడిరి.**

**వచనము 23**. **ఆ దినమున** ఈ సంఘర్షణను ఇదివరకటి సంఘర్షణతో ముడిపెట్టుటకు ఒక కాలక్రమానుగత గురుతుగా ప్రయోజనపడుచున్నది. అది కనబడుచున్నట్లుగా, యేసు అధికారము ప్రశ్నింపబడుట (21:23-27), ఆయన ఉపమానములు చెప్పుట (21:28-22:14), మరియు ఈ సంఘర్షణలు (22:15-46) ఇవన్నీ కూడ క్రీస్తు శ్రమల వారములోని మంగళవారము నాడు సంభవించినవి.

ఈ సారి **యేసు** యొద్దకు **సద్దూకయ్యులు,** యూదులలో సంపన్న వర్గమునకు సంబంధించినవారు, వచ్చారు (3:7; 16:1పై గల వ్యాఖ్యానము చూడు). ఈ వర్గమునకు చెందిన గుంపు చిన్నదే, అయినప్పటికిని శక్తివంతమైనది, వారు పలుకుబడితో కూడిన తమ ప్రభావమును యెరూషలేములో నుండి గట్టిగా వినియోగించుకొనుచుండిరి. సమరయుల వలెనే, వారు మోషే యొక్క ఐదు గ్రంథములను - పంచకాండములను - మాత్రమే దేవుని వాక్కుగా అంగీకరించారు.[11] మిగిలిన పాత నిబంధనను, మరియు పరిసయ్యులు గౌరవించు మౌఖిక సాంప్రదాయములను వారు తృణీకరించారు.

పరిసయ్యులకు తారతమ్యముగా, ఆత్మ యొక్క అక్షయతను, చావు తరువాతి జీవితము, శిక్షలు మరియు ప్రతిఫలములు, లేక మృతుల **పునరుత్థానమును** సద్దూకయ్యులు నమ్మలేదు (అపొస్తలుల కార్యములు 23:8).[12] పునరుత్థానమునకు సంబంధించినంత వరకు ధర్మశాస్త్రములో మోషే విదితమగా విశదీకరించనందు వలన, పునరుత్థానము గూర్చిన అభిప్రాయమంతటిని వీరు మొత్తానికే తృణీకరించారు. ఈ వాదోపవాదము వలన కలిగిన మానసిక ఉద్రిక్తతను తరువాతి యూదా మత బోధకుల సాహిత్యము ప్రకటించుచున్నది. మిశ్నా ప్రకారము, పునరుత్థాన సిద్ధాంతము మోషే ధర్మశాస్త్రము నుండి తీసికొనబడినది కాదని చెప్పువారికి వీరిలో సద్దూకయ్యులు కూడ ఉన్నారు - రానున్న లోకములో ఏ విషయంలోను పాలుపంపులుండవు.[13]

యేసు పరిచర్య చేయుచుండిన రోజుల్లో ఆయనను వ్యతిరేకించుచుండిన వారిలో పరిసయ్యులు ముఖ్యులై యుండగా, సద్దూకయ్యులు ఆదిమ సంఘమునకు ముఖ్య విరోధులై యుండిరి. ఈ హేతువునుబట్టియే అపొస్తలులు, "యేసునుబట్టి మృతులలో నుండి పునరుత్థానము కలుగునని ప్రకటించుచుండిరి" (అపొస్తలుల కార్యములు 4:1, 2). యేసు కాలములో ఎంతో ప్రాముఖ్యమైనదై యుండిన సద్దూకయ్యుల గుంపు, క్రీ.శ. 70లో యెరూషలేము పట్టణము నాశనమైన తరువాత ఎచ్చోటనైనను దర్శనమీయలేనంతగా అంతరించి పోయింది.

**వచనము 24.** పరిసయ్యుల శిష్యులు మరియు హేరోదీయులకు వలెనే (22:15), సద్దూకయ్యులు కూడ ఆయనను చిక్కుపర్చుటకే యేసు యొద్దకు వచ్చారు (చూడు 16:1). వారు ఆయనను **బోధకుడా** అని సంబోధించిన తరువాత (వారు అంగీకరించిన) ధర్మశాస్త్రములో నుండి ఉదహరించుచు వారి ప్రశ్నను మొదలుపెట్టారు: **ఒకడు పిల్లలు లేక చనిపోయిన యెడల అతని సహోదరుడు అతని భార్యను పెండ్లిచేసికొని తన సహోదరునికి సంతానము కలుగజేయవలెనని మోషే చెప్పెను.** ఇది ద్వితీయోపదేశకాండము 25:5, 6లోని భావానువాదమై యున్నది, మరియు చచ్చినవాని భార్యను అతని సోదరుడో ఆ తరువాతి వారసుడో వివాహం చేసుకొనే యూదుల ఆచారమని (levirate law) సాధారణంగా సూచింపబడినది. ఈ పదము "బావ" లేక "బావమరిది" అని అర్థమిచ్చు *levir* అను లాటిన్ పదము నుండి ఉత్పన్నమగుచున్నది పైన పేర్కొనబడిన యూదుల ఆచారము ప్రకారముగా, ఒకడు పిల్లలు పుట్టకుండానే మరణించినట్లయితే, విధవరాలైన తన భార్యను అతని సహోదరుడు తమ సతీమణిగా పరిగ్రహించి మరణించిన వాని పేరున సంతానోత్పత్తి కలిగించవలసి యుండినది.

ఈ వాడుక అనేక ప్రాచీన సమాజములలో అభ్యసింపబడినది. మరణించినవాని పేరట సంతానోత్పత్తి కలిగించుచు, వాని ఆస్తినంతటిని అతని కుటుంబములోనే ఉంచుట ద్వారా మరణించిన వాని పేరు నిలిపి యుంచబడవలెననునది దాని ఉద్దేశమై యుండినది. ఈ ఆచారము వందల కొలది సంవత్సరముల క్రితం ధర్మశాస్త్రము ఇవ్వబడక మునుపు, పితరుల రోజుల్లో వాడుకలో ఉండినది. తన సహోదరుని పక్షముగా సంతానోత్పత్తి కలిగించుటకు నిరాకరించినందులకు యూదా కుమారుడైన ఓనానునకు మరణ శిక్ష విధింపబడినదను వాస్తవము ద్వారా ఈ వాడుకలో గల గాంభీర్యము స్పష్టముగా కనబడుచున్నది (ఆదికాండము 38:8–10). ఈ ఆచార నియమము మోషే చేత అమలుచేయబడినప్పుడు, అది ఎంతో గంభీరమైనదిగా ఎంచబడినది; ఈ నియమమును ఏ విధంగా ఉల్లంఘించినను అది అవమానకరమైన నేరముగా పరిగణింపబడినది (ద్వితీయోపదేశకాండము 25:7–10).

**వచనములు 25–27.** యూదుల ఈ నియమమును ఉదహరించి చెప్పిన తరువాత, సద్దూకయ్యులు **ఏడుగురు సహోదరులుండిన** ఒక సన్నివేశమును ప్రవేశపెట్టారు. అందరిలో పెద్దవాడు **వివాహం చేసుకొని, సంతానము లేకుండానే చనిపోయాడు**. ఈ నియమము ప్రకారము, అతడు **తన భార్యను తన** తరువాతి **సహోదరునికి వదిలిపెట్టాడు**. ఈ ప్రక్రియ, ఆమె ఒకరి తరువాత మరొకరిని, మిగిలిన ఆరుగురు సహోదరులను వివాహమాడు వరకు కొనసాగినది. చివరకు, ఆమె కూడ **మరణించినది**.

అది వాస్తవముగా జరిగిన ఒక సంఘటన యన్నట్లు సద్దూకయ్యులు ఈ సన్నివేశమును యేసు యెదుట నివేదించారు. ఏది ఏమైనా, పునరుత్థానము అసాధ్యమైన అంశముగా అగుపించునట్లు చేయుటకు అర్థరహితమైన ఈ అనుభవమును వారు తమ సొంతంగా తయారుచేసి యుందురు. ఒక స్త్రీ ఏడుగురు పురుషులను వివాహము చేసికొనినను ఒక్కరి ద్వారానైనా పిల్లలను కనలేదంటే, సహజంగానే, ఆమె తానే పిల్లలను కనలేని గొడ్రాలైతే తప్ప, ఇది నమ్మశక్యముకాని విషయమై యున్నది. బహుశా ఈ కథను కల్పించు ప్రేరేపణ సద్దూకయ్యులకు అప్రమాణిక గ్రంథం (అపొక్రిఫ) ద్వారా కలిగియుండవచ్చును. తోబిత్ అను గ్రంథంలో, శారా అను పేరు గల స్త్రీ ఏడుగురు పురుషులను వివాహమాడినది,

అయితే వారందరు తోడబుట్టిన సహోదరులో కాదో స్పష్టముగా చెప్పబడలేదు. ప్రతి ఒక్కరి విషయములో, వివాహ విధిని వారు శోభనముతో పూర్తిచేయక మునుపే, భర్త ఒక దయ్యము చేత హతమార్చబడెను.[14]

**వచనము 28**. మనము చర్చించుచున్న నియమమును ఉదాహరించి చెప్పుచు అసాధారణమైన ఈ సన్నివేశమును నివేదించిన తదుపరి, **కాబట్టి, పునరుత్థానమందు, ఈ యేడుగురిలో ఆమె ఎవరికి భార్యగా ఉండును**? అని సద్దూకయ్యులు యేసునడిగారు. సద్దూకయ్యులు ఇదే సమస్యతో ఇంతకు మునుపటి సందర్భములలో పరిసయ్యులను కలవరపరచి వారిని సంభ్రమాశ్చర్యములో ముంచెత్తి యుందురు.[15] ఈ ధోరణిని అనుసరించు వాదోపవాదములు *reductio ad absurdum* అని పిలువబడినది, అనగా పరిశీలనగా పరీక్షింపబడుచుండు విషయమును అర్థరహితమైన అసంభవముగా చేయుట యని అర్థము. పరిహాసమునకు పాత్రయగు ఈ విధమైన పరిస్థితికి దారితీయు ఏ అభ్యాసమునైనను దేవుడు ఆజ్ఞాపించడని సద్దూకయ్యులు నమ్మారు.[16]

సద్దూకయ్యులడిగిన ప్రశ్న, ఇప్పుడు ఇహలోకములో ఈ జీవితము ఎలా కొనసాగుచున్నదో అదే విధమైన జీవితము పునరుత్థానము కూడ కొనసాగునను అబద్ధ పూర్వసిద్ధాంతముపై ఆధారపడినదై యున్నది. ఒకడు తరువాతి జీవితములో బహుభార్యాత్వము సుప్రసిద్ధమైన వాడుకయై యుండినది. సంబంధిత అనేక ఉదాహరణములు పాత నిబంధనలో గ్రంథస్థం చేయబడి యున్నవి. ఏది ఏమైనా ఒక స్త్రీ ఒకే సమయంలో ఒకని కంటె ఎక్కువ మంది భర్తలను కలిగియుండు (బహు భర్తృత్వము) విషయమును వారు ఊహించుకొనలేక పోయారు. సద్దూకయ్యులు నివేదించిన సన్నివేశము యొక్క హాస్యాస్పదమైన లక్షణము, ఆ స్త్రీ, ఒకరి తరువాత మరొకరిని వరుసగా ఏడుగురు భర్తలను వివాహమాడినందును ఆలోచన చేత యింకా ఎక్కువ హాస్యాస్పదమగునట్లు చేయుచున్నది.

**వచనము 29.** సద్దూకయ్యులు అడిగిన ప్రశ్నకు సమాధానమిచ్చుచు, నాయకులై యుండిన వీరు **పొరబడుచున్నారని యేసు** వారికి తెలియజెప్పాడు. ఇచ్చట వాడబడిన గ్రీకు క్రియా పదము *planaō* “దారి తప్పుట” లేక “పెడదారిలో పెట్టబడుట” అని అర్థమిచ్చుచున్నది. ఈ పదము, ఒక గొఱ్ఱె దారి తప్పిపోయినదని చెప్పబడుచుండిన సందర్భములో 18:12లో వాడబడినది. ఆ తరువాత, యేసు, వారికి వ్యతిరేకముగా రెండు నిందలను వారిపై మోపాడు. మొదటిది, వారు **లేఖనముల** గూర్చి అజ్ఞానులై యున్నారని చెప్పాడు. ఈ విషయము 31 మరియు 32 వచనములలో విపులీకరింపబడినది. రెండవది, వారు **దేవుని శక్తిని** అర్థంచేసికొనలేదని యేసు చెప్పాడు. ఈ నిందారోపణ 30వ వచనంలో వ్యాఖ్యానింపబడినది.

**వచనము 30.** మనుష్యులను మార్చుటకు దేవునికి శక్తికలదని యేసు వివరించాడు: **పునరుత్థానమందు ఎవరును పెండ్లి చేసికొనరు పెండ్లికియ్యబడరు, వారు పరలోకమందున్న దూతలవలె ఉందురు.** వివాహము రెండు దృష్టికోణాలో వర్ణింపబడినది: “పెండ్లిచేసికొనును” అను పదము పురుషునికి సంబంధించినది, ఏలయనగా అతడు తన కొరకు ఒక భార్యను పరిగ్రహించును, అయితే “పెండ్లికియ్యబడును” అను పదము స్త్రీకి సంబంధించినది, ఏలయనగా ఆమె తనను వివాహమాడు పురుషునికి తన తండ్రి చేత అప్పగింపబడును. ఈ ఐహిక నియమములు పరలోక రాజ్యములో వర్తించవని యేసు ప్రబోధించుచుండెను.

రానున్న లోకములో, మనుష్యులు దేవదూతల (*angelos*) వలె ఉందురు, కానీ వారు దేవదూతలుగా కారు.[17] వారి ఆధ్యాత్మిక స్వభావమునుబట్టి, వారు పెండ్లి చేసికొనరు లేక పిల్లలను కనరు.

పరిశుద్ధ బైబిల్‌కు వెలుపల యూదుల సాహిత్యములో ఇదే విధమైన ఆలోచనలు కలవు. ఉదా॥ టాల్మడ్ ఈ క్రింది విధముగా సెలవిచ్చుచున్నది,

> [భవిష్యత్ లోకము ఈ లోకము వంటిది కాదు.] భవిష్యత్ లోకములో తినుటగాని, త్రాగుట గాని, ప్రచారము చేయుటగాని, వ్యాపారము చేయుటగాని, అసూయపడుటగాని, ద్వేషించుట గాని పోటీపడుటగాని ఏదియు ఉండదు, కానీ వారి తలలపై కిరీటములు ధరించిన నీతిమంతులు ప్రకాశమానమైన దైవ సన్నిధిని విందారగించుచు కూర్చొనియుందురు.[18]

పునరుత్థానము నొందిన శరీరము మరియు భవిష్యత్ ఉనికి, ప్రస్తుతమున్న దానికి భిన్నముగా నుండునని క్రొత్త నిబంధనలోని ఇతర వాక్యభాగములు నిశ్చయపర్చుచున్నవి (1 కొరింథీయులకు 15:35-58; 1 యోహాను 3:2).

**వచనములు 31, 32.** పునరుత్థానమందు మానవులను మార్చుటకు దేవునికి గల శక్తి గూర్చి చెప్పిన తరువాత, యేసు సద్దూకయ్యుల లేఖనముల అజ్ఞానము గూర్చి ప్రస్తావించాడు (22:29). యూదా మత బోధకుల తీరులో, ఆయన మరొక పర్యాయము పాతనిబంధనలోని ఒక ఉల్లేఖనమును భూమికగా చేసుకొని, **... మీరు చదువలేదా?** అని వారిని ప్రశ్నించాడు (12:3, 4పై గల వ్యాఖ్యానము చూడు). **ఆ మాటలు మాటలాడినది దేవుడే** అని అటుతరువాత చెప్పాడు. సరికదా, ఈ మాటలను "మోషే గ్రంథమునకు" ఆపాదించుచు మండుచుండిన పొద గూర్చిన సంఘటనను మరొకసారి వారికి గుర్తుచేశాడు (మార్కు 12:26).

పునరుత్థానము వాస్తవము కాదని నిరూపించుటయే సద్దూకయ్యుల అంతిమ లక్ష్యమై యుండినదని యేసు ఎరిగియుండినందు వలన, పునరుత్థానమును రుజువుచేయుటకు వారు పూజించుచుండిన పితరులకు ఆయన పిలుపునిచ్చుచు వారు గౌరవించుచుండిన లేఖనములను ప్రయోగించాడు. విదితముకాని ఎదో ఒక ఒక వాక్యభాగమును ఆయన ఉదాహరణముగా చెప్పలేదు, కానీ అందరికి సుపరిచితమైన విషయమునే గుర్తుచేసాడు. నిర్గమకాండము 3:6లో దేవుడు తనను తానే గుర్తించుకొనిన వివరమును ఉల్లేఖించాడు: **నేను అబ్రాహాము దేవుడను, ఇస్సాకు దేవుడను, యాకోబు దేవుడనై యున్నాను.** సజీవుడైన దేవుడు అబ్రాహాము, ఇస్సాకు, మరియు యాకోబుల దేవుడై యున్నాడు గనుక వారు ఇంకను సజీవులై యుండిరని యేసు భావించుచుండెను (చూడు 8:11; లూకా 13:28; 16:22-31; యోహాను 8:56) **ఆయన సజీవులకే దేవుడు గాని మృతులకు దేవుడు కాదని** చెప్పుచు తన మాటలను ఆయన ముగించాడు.

పాత నిబంధనలో పునరుత్థాన సిద్ధాంతము ప్రాముఖ్యమైనది కాకపోగా, అనేక వాక్యభాగములు దాని వాస్తవము గూర్చి బోధించుచున్నవి - కనీసము సూచనలనైనా ఇచ్చుచున్నవి.[19] ఏది ఏమైనా, పునఃరుత్థానము, ధర్మశాస్త్రములో సవివరంగా బోధించబడలేదు. బైబిల్ గ్రంథంలోని అది పంచకాండములే అధికారపూర్వకమైనవని సద్దూకయ్యులు దృష్టించినందు వలన, పునఃరుత్థానము గూర్చిన అభిప్రాయమును

సూచనప్రాయంగా బోధించుచున్నదని వారు అంగీకరించిన ఒక వాక్యభాగమును యేసు తీసికొన్నాడు. అటుతరువాత, టాల్ముడ్‌లో, "మత శాఖాభిమానులు" అని పిలువబడినవారికి – ఈ ముద్ర వేయబడినవారిలో సద్దూకయ్యులు మరియు పునఃరుత్థానము లేదని చెప్పిన ఇతరులు సహితము ఉన్నారు – సమాధానమిచ్చుటకు ఇదే పద్ధతి వాడబడినది. "పునరుత్థానము పంచ గ్రంథములలో నుండి ఎలా ఉద్భవించినది?" అను ప్రశ్న వేయబడుచుండినది. ఈ బోధను రుజువు చేయుటకు యూదా మతోపదేశకులు అనేక వాక్యభాగములను ఉదహరించి చెప్పుచుండిరి (నిర్గమకాండము 6:4; సంఖ్యాకాండము 18:28; ద్వితీయోపదేశకాండము 4:4; 11:21; 31:16),[20] కానీ వీటన్నిటిలో యేసు ఏ ఒక్కటైనను యేసుక్రీస్తు ఉదాహరించి చెప్పినది ఒప్పించుచుండినంతగా ఒప్పించలేదు.[21]

**వచనము 33.** యేసు ప్రత్యుత్తరమును వినిన తరువాత, **జనులు ఆయన బోధకు ఆశ్చర్యపడిరి** (చూడు 22:22, 46). "తరువాత వారాయనను మరేమియు అడుగ తెగింపలేదు గనుక శాస్త్రులలో కొందరు, "బోధకుడా, నీవు యుక్తముగా చెప్పితివనిరి" అని వ్రాయబడిన వివరమును లూకా 20:39, 40 చెప్పుచున్నది.

### అతి గొప్ప ఆజ్ఞ గూర్చిన ఆందోళన (22:34-40)

**34ఆయన సద్దూకయ్యుల నోరు మూయించెనని పరిసయ్యులు విని కూడివచ్చిరి. 35వారిలో ఒక ధర్మశాస్త్రోపదేశకుడు ఆయనను శోధించుచు 36–బోధకుడా, ధర్మశాస్త్రములో ముఖ్యమైన ఆజ్ఞ ఏదని అడిగెను. 37అందు కాయన–నీ పూర్ణహృదయముతోను నీ పూర్ణాత్మతోను నీ పూర్ణమనస్సుతోను నీ దేవుడైన ప్రభువును ప్రేమింప వలెననునదియే. 38ఇది ముఖ్యమైనదియు మొదటిదియునైన ఆజ్ఞ. 39నిన్ను వలె నీ పొరుగువాని ప్రేమింపవలెనను రెండవ ఆజ్ఞయు దానివంటిదే. 40ఈ రెండు ఆజ్ఞలు ధర్మశాస్త్రమంతటికిని ప్రవక్తలకును ఆధారమై యున్నవని అతనితో చెప్పెను.**

**వచనము 34.** పరిసయ్యుల శిష్యులు, హేరోదీయులతో కూడ కలసి, యేసును చిక్కుపరచవలెనని పంపబడిరి, కానీ వారు విఫలులయ్యారు (22:15, 16, 22). ఆయనను అప్రతిష్ఠపాలుజేయుటకు సద్దూకయ్యులు సహితము వారి శాయశక్తులా ప్రయత్నించారు, కానీ వీరు కూడ ఓటమిపాలయ్యరు (22:23, 33). యేసు తానిచ్చిన సమాధానముతో, ఆయన వారి **నోరు మూయించాడు**. "నోరు మూయించుట" అని అర్థమిచ్చు గ్రీకు పదము (*phimoō*), 12వ వచనములో "మౌనియై యుండెను" అని అనువదింపబడిన పదము, "పెదవి కదపకుండునట్లు నోటికి చిక్కము పెట్టుట" అను అక్షరార్థమిచ్చును. ఈ వివరమును **వినిన పరిసయ్యులు,** యేసుకు విరోధముగా కుట్ర పన్నుటకు కూడుకొన్నారు.

**వచనము 35**. యేసును చిక్కుపర్చవలెనని ఎంతో ప్రయత్నించిన ఈ పరిసయ్యులు కూడ విఫలులయ్యారు. బహుశా వారి ప్రతినిధిగా యేసు దగ్గరకు వెళ్లునట్లు వారు ఎన్నుకొనిన వ్యక్తి బలహీనతనుబట్టి వారు విఫలులై యుండవచ్చును. ప్రశ్నలు అడిగినవారందరిలో, ఇతనొక్కడే చిత్తశుద్ధిగలవాడై యుండెనని అర్థమగుచున్నది. మత్తయి ఇతనిని **వారిలో ఒకడు, ఒక ధర్మశాస్త్రోపదేశకుడు** (*nomikos*) అని గుర్తించుచున్నాడు. అనేక చేతి రాత ప్రతులలో ధర్మశాస్త్రోపదేశకుడు అను పదము విడిచిపెట్టబడినది, గనుక

నకలు వ్రాయుచుండినవాడు ఈ పదమును లూకా 10:25లో నుండి ఎరువు తెచ్చుకొన్నాడని కొందరి చేత విశ్వసింపబడినది – ఈ వాక్యము ఇదే విధమైనది, అయినను భిన్నమైన, మరొక కథను చెప్పుచున్నది.[22] యూదుల సందర్భములో, "ధర్మశాస్త్రోపదేశకుడు" అను పదము మోషే ధర్మశాస్త్రములో విద్యనభ్యసించినవానిని, "తోరా పండితుడని" సూచించినది (JNT). మార్కు సువార్త రచయిత దీనికి పర్యాయ పదమును వాడుచు ఈయనను "శాస్త్రి" (*grammateus*) అని గుర్తించుచు అతడు యేసును ఆ ప్రశ్న తన సొంతగా అడిగాడని భావించుచున్నాడు (మార్కు 12:28). శాస్త్రియైనవాడు ధర్మశాస్త్రమును అనువదించుచు, మౌఖిక నియమమును ఎరిగియుండి దానిని అన్వయించుట, అతడు చేయాల్సిన పనై యుండినది (2:4పై గల వ్యాఖ్యానము చూడు).

**వచనము 36.** యేసు యొద్దకు వచ్చిన శాస్త్రి ఆయనను శోధించుచు, **బోధకుడా, ధర్మశాస్త్రములో ముఖ్యమైన ఆజ్ఞ ఏది?** అని అడిగాడు. ఈ ప్రశ్నను విద్వాంసులై యుండిన యూదులు తరచుగా చర్చించుచుండిరి. ధర్మశాస్త్రమును ఒక్క సామన్య వాంగ్మూలములో లేక ఆజ్ఞలో సారంశముగా పెట్టవలెననునది వారి ఆశ. టాల్ముడ్‌లో, ఇటువంటిదే ఒక ప్రశ్న కలదు: "తోరా గ్రంథములోని అత్యావశ్యకాంశములను ఒక్క ముక్కలో చెప్పుటకేదైనా ఒక చిన్న పదసముదాయమున్నదా?"[23] అచ్చట ఇవ్వబడిన సమాధానము సామెతలు 3:6లో కలదు: "నీ ప్రవర్తన అంతటియందు ఆయన అధికారమునకు ఒప్పుకొనుము. అప్పుడు ఆయన నీ త్రోవలను సరాళము చేయును." ఈ సమాధానము పంచ కాండములకు బదులుగా సామెతల గ్రంథంలో నుంచి తీసికొనబడుట ఆసక్తికరమైన అంశంగా ఉన్నది.

మోషే అందుకొన్న ధర్మశాస్త్రములో 613 ఆజ్ఞలున్నవని యూదుల మతోపదేశకుడైన సిమ్‌లాయ్ ఉపదేశించాడు. ఏది ఏమైనా, ఈ ఆజ్ఞలు దావీదు మహా రాజు చేత 11 వరకు (కీర్తనలు 15), యెషయా చేత ఆరు వరకు (యెషయా 33:15), మీకా చేత మూడు వరకు (మీకా 6:8), మరలా యెషయా చేత రెండు వరకు (యెషయా 56:1), చివరకు ఒక్కటిగా ఆమోసు చేత (ఆమోసు 5:4), మరియు హబక్కూకు చేత (హబక్కూకు 2:4) కుదింపబడినవి.[24]

**వచనములు 37, 38.** అందుకు యేసు, **నీ పూర్ణ హృదయంతోను నీ పూర్ణత్మతోను నీ పూర్ణమనస్సుతోను నీ దేవుడైన ప్రభువును ప్రేమింపవలెననునదియే** అని ప్రత్యుత్తరమిచ్చాడు. ఈ ఉల్లేఖనము ద్వితీయోపదేశకాండము 6:5లో నుండి తీసికొనబడినది. హెబ్రీ గ్రంథ పాఠములో మూడు ముఖ్య పదములు కలవు, "హృదయము," "ఆత్మ," మరియు "శక్తి." మత్తయి ఉదాహరించి ఉల్లేఖించుచున్న మాటల్లో, "మనస్సు" చేర్చబడి యున్నది, కానీ "శక్తి" విడిచిపెట్టబడినది. మార్కు మరియు లూకా రచించిన సువార్తలలోని ఇదే వాక్యములో నాలుగు పదములున్నవి: "హృదయము," "ఆత్మ," "వివేకము," మరియు "బలము" (మార్కు 12:30; లూకా 10:27). సమదృక్పథ సువార్తలలో గల వైవిధ్యములు, రచయితలు సెప్టువజింట్‌ను ఉపయోగించుట వలన ఏర్పడియుండవచ్చును. గ్రీకు అనువాదమునకు సంబంధించిన కొన్ని ప్రాచీన ప్రతులు "హృదయమును"ను (*leb*) "మనస్సు"గా (*dianoia*) అనువదించుచున్నవి.

**ముఖ్యమైనది మరియు మొదటిదియునైన** ఈ ఆజ్ఞ **శేమ**ను అనుసరించుచున్నది. అసలైన **శేమ** ద్వితీయోపదేశకాండము 6:4లో కలదు, మరియు "ముఖ్యమైన ఆజ్ఞ"

ద్వితీయోపదేశకాండము 6:5లో కలదు. పొడిగింపునుబట్టి, సంఖ్యా 15:37–41 కూడ కలుపుకొని, ఇతర వాఖ్యభాగములు, **శేమ**లో చేర్చబడినవి (ద్వితీయోపదేశకాండము 11:13–21 కూడ చూడు). శేమ అను పేరు ప్రార్థనలోని మొదటి మాట *shama´* నుండి ఉత్పన్నమయ్యింది, "వినుము" అని దీని అర్థము (ద్వితీయోపదేశకాండము 6:4). మార్కు రచయిత ప్రకారము, యేసు ఈ మాటను కలిపి తన సమాధానము నిచ్చాడు: "ఓ ఇశ్రాయేలూ, వినుము! మన దేవుడైన ప్రభువు అద్వితీయ ప్రభువు" (మార్కు 12:29).

**వచనము 39.** యేసు ముఖ్యమైనది మరియు మొదటిదియునైన ఆజ్ఞ గూర్చి సమాధానమిచ్చిన తదుపరి (22:36), **నిన్ను వలె నీ పొరుగువాని ప్రేమింపవలెనను రెండవ ఆజ్ఞయు దాని వంటిదే** అని చెప్పుచు తన సమాధానమును కొనసాగించాడు[25] (చూడు 5:43; 19:19; రోమీయులకు 13:9, 10; గలతీయులకు 5:14; యాకోబు 2:8; 1 యోహాను 4:21) ఈ ఉల్లేఖనము సెప్టువజింట్‌లోని లేవీయకాండము 19:18లో నుండి తీసికొనబడినది. యూదుల ఇతర మతోపదేశకులు, క్రీస్తుకు మునుపు మరియు క్రీస్తుకు తరువాత, ఒకడు తన పొరుగువాని యెడల సముచితముగా ప్రవర్తింపవలెనని నొక్కివక్కాణించారు. యూదుల మతోపదేశకుడైన హిల్లేల్ ఈ సువర్ణ నియమము యొక్క వ్యతిరేకార్థక రూపముతో ధర్మశాస్త్రము యొక్క సారాంశమును ఇలా చెప్పాడు: "నీవు దేనిని ద్వేషించుదువో, దానిని నీ పొరుగువాని యెడల చేయవద్దు."[26] "నిన్ను వలె నీ పొరుగువాని ప్రేమించుము" అను ఆజ్ఞ "తోరాలోని గొప్ప సూత్రమై యున్నది" అని యూదుల మతోపదేశకుడైన అకిబ చెప్పాడు.[27] లూకా సువార్తలోని సంబంధిత వాక్యభాగములో, నీ సహాయము అవసరములో ఉన్నవారెవరైనా సరే, వాడు మన "పొరుగువాడు" అంటూ పొరుగువాడెవరో యేసు చక్కగా నిర్వచించాడు (లూకా 10:29–37).

**వచనము 40. ఈ రెండు ఆజ్ఞలు ధర్మశాస్త్రమంతటికిని ప్రవక్తలకును ఆధారమై యున్నవి** అని చెప్పుచు యేసు తన సమాధానమును ముగించాడు. దేవుడు ప్రేమించుట ద్వారా ఒకడు పది ఆజ్ఞలలోని మొదటి నాలుగు ఆజ్ఞలను నెరవేర్చుననియు, పొరుగువాని ప్రేమించుట ద్వారా మిగిలిన ఆరు ఆజ్ఞలను నెరవేర్చుచున్నట్లే అనియు చెప్పబడుచున్నది (నిర్గమకాండము 20:1–17; ద్వితీయోపదేశకాండము 5:6–21). ఇది నిజమే, అయితే యేసు దీనిని మించిన దానిని చెప్పుచుండెను. ఇచ్చట వ్రాయబడియున్న "ధర్మశాస్త్రమంతటికిని ప్రవక్తలకును" అను మాటలు, హెబ్రీ బైబిల్ అంతటికి మొత్తంగా ప్రాతినిధ్యం వహించుచున్నవి. "ఆధారమై" అని అర్థమిచ్చుచున్న గ్రీకు పదము (*kremannumi*) "ఆధారపడి వ్రేలాడుట" అని కూడ అర్థమిచ్చును. "ఒక తలుపు దాని మడత బందులపై ఆధారపడి వ్రేలాడుచున్నట్లుగా, పాత నిబంధన అంతయు ఈ రెండు ఆజ్ఞలపై ఆధారపడుచున్నది."[28]

యేసు నొద్దకు వచ్చిన శాస్త్రి యేసు ఇచ్చిన సమాధానములతో ఏకీభవించుట ద్వారా ఎంతో గొప్ప స్ఫూర్తిదాయకమైన సూక్తిని కనుపర్చాడు (మార్కు 12:32, 33). గనుక యేసు అతని గూర్చి ఒక సదభిప్రాయమేర్పరచుకొని, "నీవు దేవుని రాజ్యమునకు దూరముగా లేవు" అని అతనితో చెప్పాడు (మార్కు 12:34).

## మెస్సీయ గూర్చిన ప్రశ్న (22:41-46)

**[41]ఒకప్పుడు పరిసయ్యులు కూడియుండగా యేసు వారిని చూచి [42]- క్రీస్తునుగూర్చి మీకేమి తోచుచున్నది? ఆయన ఎవని కుమారుడని అడిగెను. వారు- ఆయన దావీదు కుమారుడని చెప్పిరి. [43]అందుకాయన-ఆలాగైతే**
**-నేను నీ శత్రువులను నీ పాదములక్రింద ఉంచువరకు [44]నీవు నా కుడిపార్శ్వమున**
**కూర్చుండుమని ప్రభువు నా ప్రభువుతో చెప్పెను**
**అని దావీదు ఆయనను ప్రభువని ఆత్మవలన ఏల చెప్పుచున్నాడు? [45]దావీదు ఆయనను ప్రభువని చెప్పినయెడల, ఆయన ఏలాగు అతనికి కుమారుడగునని వారినడుగుగా**
**[46]ఎవడును మారుమాట చెప్పలేకపోయెను. మరియు ఆ దినమునుండి ఎవడును ఆయనను ఒక ప్రశ్నయు అడుగ తెగింపలేదు.**

**వచనము 41**. **యేసు** ఆ దినాన ఉదయ కాలము నుండే దేవాలయములో బోధించుచుండెను (21:23). ఎలాగైనా సరే ఆయన ధర్మశాస్త్రమును లేదా రోమా ప్రభుత్వ నియమమును ఉల్లంఘించునట్లు చేయబడవలెననియు (22:15-40), ఆయనను చిక్కుపర్చవలెననియు ఆయన శత్రువులు మూడు ప్రశ్నలు రూపొందించారు. ఆయన సమాధానముగా చెప్పిన విషయములు ఎవ్విధముగాను అసత్యమని నిరూపింపబడజాలని విధముగా, యేసు వారిడిగిన మూడు ప్రశ్నలకు ప్రత్యుత్తరమిచ్చాడు. వారి ప్రశ్నలకు ప్రతిస్పందించిన పిమ్మట, ప్రభువు తన సొంత **ప్రశ్న ఒకటి** వారినడిగాడు. కుమ్మక్కై ఆయనను విరోధముగా పన్నుచుండిన కుట్రలోని తరువాతి పావును కదలించుటకు సమీపములో కూడుకొని యుండిన **పరిసయ్యులకు** ఆయన ఈ ప్రశ్న వేసాడు (22:34). యేసు వారిని ఈ ప్రశ్న అడిగినప్పటికి ఆయన యింకను దేవాలయములోనే ఉండెనని మార్కు 12:35 రూఢిపర్చుచున్నది.

**వచనము 42.** యేసు "నేనెవరినని మీరు చెప్పుదురు?" అని వారి ప్రశ్నించలేదు. అంతకు మునుపు, ఇదే ప్రశ్నకు సమాధానంగా, ఆయన "సజీవుడగు దేవుని కుమారుడైన క్రీస్తు" అని పేతురు ఒప్పుకొన్నాడు (16:15, 16). దానికి మారుగా, ఆయన తన గుర్తింపు గూర్చి వారేమి చెప్పుదురో యని పరోక్షంగా ప్రశ్నించాడు.ఆయన వారిని యీలా అడిగారు, **క్రీస్తునుగూర్చి మీకేమి తోచుచున్నది? ఆయన ఎవని కుమారుడని అడిగెను.** ఆయన తన శ్రోతల ఆలోచనా ధోరణిని ఉత్తేజపర్చుటకు "మీకేమి తోచుచున్నది?" అను ప్రశ్నను మరొక చోట కూడ ప్రయోగించాడు (17:25; 18:12; 21:28). ఈ సందర్భములో, ఆయన చిన్న పరీక్ష వంటి ప్రశ్నలడుగుచు వారి యొద్ద మెస్సీయా వంశపరంపర గూర్చిన వారి అవగాహనను వెలికి తీయచుండెను.

అందుకు వారు, **ఆయన దావీదు కుమారుడు** అని సరిగా ఉత్తరమిచ్చాడు. వారు ఈ ఉత్తరమిచ్చునట్లు యేసు ఉద్దేశపూర్వకంగానే చేసాడు. రెండు దినముల క్రితమే, ఆదివారం నాడు, ఆయన యెరూషలేము లోనికి గాడిద నెక్కి విజయోత్సవముతో ప్రవేశించాడు. ఆ సమయంలో, "దావీదు కుమారునికి జయము" అంటూ ఆయన స్తుతింపబడినాడు (21:9). సోమవారం నాడు, "దావీదు కుమారునికి జయము" అంటూ పిల్లలు వేసిన కేకల చేత యేసు ప్రస్తుతింపబడినాడని ప్రధాన యాజకులు మరియు శాస్త్రులు ఆగ్రహము చెందారు.

"దావీదు కుమారుడు" (21:15, 16) అనునది మెస్సీయా సంబంధమైన ఒక బిరుదై యుండెను, పాత నిబంధన వాగ్దానముల నెరవేర్పు గూర్చి వారు కలిగియుండిన ఆశాజనక ఎదురుచూపును అది ప్రతిబింబించినది (1:1; 9:27; 12:23పై గల వ్యాఖ్యానమ చూడు).

**వచనము 43.** అటుతరువాత యేసు వారిని మరొక ప్రశ్న అడిగాడు: **అలాగైతే, ... దావీదు ఆయనను ప్రభువని ఆత్మవలన ఏల చెప్పుచున్నాడు?** ఆయన, "తెలిసినదాని" నుండి (క్రీస్తు, దావీదు కుమారుడు) "తెలియని" విషయమును (క్రీస్తు, దావీదునకు ప్రభువు) తెలిసికొనుట అను ప్రబోధక తీరును అనుసరించుచుండెను. "యేసు, ఆయనను దావీదు కుమారుడు అని పిలుచుచుండిన వారి నోళ్లు మూయించవలసినదని యింతకు మునుపు కోరబడినాడు, కానీ ఆ బిరుదు ఆయనకు ఇవ్వబడవలసినంత ఘనత గాని, గౌరవము గాని ఇవ్వబడుట లేదని ఇప్పుడు వాదించుచున్నాడు" అని లూయిస్ చెప్పుచున్నాడు.[29] దావీదు, అనేక కీర్తనలు రచించినవాడు, పరిశుద్ధాత్మ చేత ప్రేరేపించబడినాడని యేసు సాధికారంతో ప్రకటించుచుండెను (చూడు 2 సమూయేలు 23:2; అపొస్తలుల కార్యములు 1:16; 2:30; 2 పేతురు 1:21). 110వ కీర్తనకు గల పైవ్రాత, తొల్దొలుత రచనకు చాలా కాలం తరువాత చేర్చబడినది, "దావీదు కీర్తన" అని వ్రాయబడి యున్నది.

**వచనము 44.** ఈ వచనములోని ఉల్లేఖనము కీర్తనలు 110:1 నుండి తీసికొనబడినది, గనుక అది సెప్టుజింట్ (LXX) అనువాదమునకు దగ్గరగా నున్నది.

> **ప్రభువు నా ప్రభువుతో సెలవిచ్చినవాక్కు**
> **–నేను నీ శత్రువులను నీ పాదములకు పీఠముగా**
> **చేయువరకు నా కుడి పార్శ్వమున కూర్చుండుము.**

ప్రాముఖ్యమైన ఈ వాక్యము క్రొత్త నిబంధనలో అనేక పర్యాయములు ఉల్లేఖింపబడినది.[30] హెబ్రీ భాషలో, మొదటి "ప్రభువు"నకు (*YHWH,* దేవుని సరైనా నామము) మరియు రెండవ "ప్రభువు"నకు (*'Adon*) మధ్య గల వ్యత్యాసము చూపబడినది. యేసు క్రీస్తు తండ్రియైన దేవుని కుడిపార్శ్వమున కూర్చుండి యుండుటకు హెచ్చింపబడునని గ్రంథ పాఠము ముందుగా తెలియజెప్పుచున్నది. ఒక రాజు శత్రువులు ఆయన పాదముల క్రింద ఉంచబడుచున్నారంటే, వారు ఆయన పరిపాలనాధికారములో ఉన్న పౌరులై యున్నారనుటకు అది చిహ్నమై యున్నది.

హెబ్రీ గ్రంథ పాఠములో "పాద పీఠము" అను పదము వాక్యములోని చివరి వరుసలో కలదు: "నేను నీ శత్రువులను నీపాదములకు ఒక పీఠముగా చేయువరకు" అని వ్రాయబడి యున్నది. పురావస్తుశాస్త్రవేత్తలకు ప్రాచీన కాలము నాటి రాజుల పాద పీఠములు తిరిగి ప్రాప్తించినవి, వాటి మీద వారి శత్రువుల చిత్రములు (వంగి నమస్కరించుచున్నట్లు) చెక్కబడి యున్నవి.[31]

**వచనము 45.** యేసు మరొక ప్రశ్న అడుగుటతో తన సంభాషణ ముగించాడు: **దావీదు ఆయనను ప్రభువని చెప్పిన యెడల, ఆయన ఏలాగు అతనికి కుమారుడగును?** అని వారినడిగాడు. మెస్సీయా, దావీదు కుమారుడైనట్లయితే, ప్రేరేపింపబడిన దావీదు ఆయనను "ప్రభువు" అని ఎలా పిలుచుచున్నాడు? ఇది ఎంత కలవరపెట్టు ప్రశ్న కదా! ఒక వంశపు పూర్వీకుడు, అధవా ఎప్పుడైనా జరిగినా, తన సంతానమును "ప్రభువు" అని

అరుదుగా సంబోధించును. మెస్సీయా దావీదు వంశములో నుండి ఎలా రాగలడు, అలా వచ్చినట్లయినను ఆయన అతనికి ఎలా పైవాడైయుండగలడు? ఆయన దైవమై యుండి, అదివరకే ఆయన శరీరధారిగా జన్మింపక మునుపే ఉనికిగలవాడై యుండుట వలన మాత్రమే మెస్సీయా, "ప్రభువు" మరియు "దావీదు కుమారుడునై" యుండగలడు (చూడు యోహాను 8:56-58). ఆయన దేవాలయము, యోనా, మరియు సొలొమోను కంటె మహోన్నతుడై యున్నాడని యేసు అంతకు మునుపు సాధికారంతో చెప్పాడు (12:6, 41, 42). ఇచ్చట కూడ ఆయన దావీదు కంటె గొప్పవావాడని పరోక్షంగా ప్రకటించుచున్నాడు.

**వచనము 46.** యేసు **ఆ దినమున** ఆయనను విమర్శించుచుండినవారి నోరు మూయించాడు. వారు ఆయనను మిగిలిన ఆ వారము రోజుల్లో - అనగా, కల్పితమైన తీర్పులు తీర్చబడునంత వరకు - **ఆయనను ఒక ప్రశ్నయు అడుగుటకు** తెగింపలేనంత తీవ్రముగా ఓటమిపాలయ్యారు. వారి నోళ్లు మూయించబడ్డాయే కానీ, మనుష్యులు మారలేదు, వారి మనస్సులు అసలే మారలేదు. సరికదా, ఆయనను ఇదివరకటి కంటె ఇప్పుడు యింకా ఎక్కువ ద్వేషించారు, గనుక ఎంత సేపూ ఆయనను ఎలాగు సంహరింతుమా, ఏంచేస్తే ప్రజల్లో నుండి తక్కువలో తక్కువ ప్రతిఘటన ఎదురురౌతోందా అని కుట్రలు పన్నుటలోనే సమయమంతా గడుపుచుండిరి.

✧✧✧✧✧ **పాఠములు** ✧✧✧✧✧

### రెండు బుద్ధిలేని ప్రశ్నలు, రెండు బుద్ధి గల ప్రశ్నలు (22:15-46)

బాహాటంగా ప్రకటించిన శత్రువులు వింతైన మైత్రిసంబంధాలుగల మిత్రులౌతారు. ఆయనను కుయుక్తితో కూడిన ప్రశ్నలడుగుటకు యేసు శత్రువులు అందరు కూడుకొని కుట్ర పన్నారు. కైసరుకు పన్నిచ్చుట న్యాయమా, కాదా? అడిగారు (22:15-22). అయితే ఆయన ఈ ప్రశ్న ద్వారా వంచింపబడలేకపోయాడు. ఒక స్త్రీ పరలోకమందు ఎంత మంది భర్తలను కలిగియుండవచ్చునని మరొక ప్రశ్న వేసారు (22:23-33). "మీ బైబిల్ మీకే తెలియకపోవటం మీకెంతో లజ్జాకరమైన విషయమది!" అన్నట్లు, వారికి సమాధానమిచ్చాడు.

యేసు ఎప్పుడైనాగాని అడుగబడిన గొప్ప ప్రశ్నలలోనివి రెండు, 22:34-46లో కలవు. వాటికి యేసు 22:37-40లో రెండు గొప్ప సమాధానాలిచ్చాడు. "ధర్మశాస్త్రములో ముఖ్యమైన ఆజ్ఞ ఏది?" అని అడిగిన ధర్మశాస్త్రోపదేశకునికి (22:36), *agape* ప్రేమ (దైవికమైన ప్రేమ) యే దేవుడు మన నుంచి కోరుచున్న సమస్తమునకు మూలాధారమై యున్నదని సెలవిచ్చాడు. "క్రీస్తును గూర్చి నీకేమి తోచుచున్నది, ఆయన ఎవని కుమారుడు?" (22:42) అని మనలను మనము ప్రశ్నించుకొనవలసిన యున్నది ఏలయనగా ఈ ప్రశ్నకు మనమిచ్చు సమాధానములో శాశ్వత అంతర్భావములున్నవి. యేసు, దేవుని కుమారుడు, గనుక మనము ఆయన మాటలు వినుచు వాటిలో లోబడవలసినవారమై యున్నాము (చూడు 17:5).

## పన్ను చెల్లించుట గూర్చిన ప్రశ్న (22:15-22)

పన్ను చెల్లించుచుండుటను యేసు ఎన్నడును వ్యతిరేకించలేదు. ఆయన మత్తయిని, ఒక సుంకపు గుత్తదారుని, ఆయన అపొస్తలులలో ఒకడై యుండుటకు పిలిచాడు (9:9). ఆయన సుంకరులను మరియు పాపులను ఆయన యొద్దకు ఆహ్వానించాడు, మరియు ఆయన జక్కయ్య యెరికోలోని ప్రధాన సుంకరి (లూకా 19:1-10) యెడల కృపాబాహుళ్యముగలవాడై యుండెను.

పరిసయ్యుడు మరియు సుంకరి గూర్చిన ఉపమానము, సుంకరి నీతిమంతుడుగాను పరిసయ్యుడు ఖండింపబడినవాడుగాను తీర్చబడినట్లు సోదాహరణంగా చిత్రీకరించుచున్నది (లూకా 18:9-14). యేసు, ఎంతగానో ఏవగించుకొనబడుచుండిన పన్ను ప్రభుత్వానికి ప్రయోజనకరమైనదై యుండిన పన్ను చెల్లించాడను వాస్తవముతోపాటు, ఆయన దేవాలయ సుంకము, అవినీతిమయమైన యాజకత్వమును పోషించిన సుంకమును కూడ చెల్లించాడు (17:24-27).

ప్రతి క్రైస్తవుడు ఏ ప్రభుత్వం అధికారంతో ఉన్నా, ప్రతి ప్రభుత్వానికి పన్ను చెల్లించవలెను. దేవదూషకులును, విగ్రహారాధికులునైన పరిపాలకుల పరిపాలన క్రింద ఉంటూ కూడ, యేసు "కైసరువి కైసరునకు చెల్లించుడి" అను నియమమును మినహాయించలేదు. పౌలు, మతేతర ప్రభుత్వమైన రోమా ప్రభుత్వ పరిపాలనలో ఉంటుండగా, "దేవుని వలన కలిగినది తప్ప మరి ఏ అధికారమును లేదని" చెప్పుచు (రోమీయులకు 13:1). వారి ప్రభుత్వాధికారులందరికి లోబడవలెనని క్రైస్తవులకు ఒక సార్వత్రిక ఆజ్ఞ ఇచ్చాడు. ఈ హెచ్చరికతో పేతురు ఏకీభవించుచున్నాడు (1 పేతురు 2:13-15). ప్రభుత్వమును ఎదిరించుచున్నామంటే, దేవునిని ఎదిరించుచున్నామని అర్థము, గనుక పన్ను చెల్లించుటకు నిరాకరించుచున్నామంటే దేవుని ఆజ్ఞకు అవిధేయులమగుచున్నామనే అర్థము. పన్ను మదింపు చేయుటకును, విధించుటకును పరిపాలకులకు సర్వహక్కులుండినను, మత సంబంధమైన అభ్యాసములలో జోక్యము చేసికొనుటకు వారికి ఎటువంటి హక్కైనను లేదు. వారలా చేసినప్పుడు, దేవుడు వారికి నియమించిన హద్దులను వారు మీరుచున్నారని అర్థము. ఈ సందర్భములో వారిని ఎదురించుటకు క్రైస్తవులకు సర్వహక్కులు కలవు.

## పునరుత్థానము (22:23-33)

దేవుని యందు విశ్వాసముంచుచున్నవారు పునరుత్థానము లేక తరువాతి జీవితమును నమ్మకుండా ఎలా ఉండగలరు? పునరుత్థానమందు విశ్వాసముంచని కొందరు క్రైస్తవులను పౌలు కొరింథులో ఎదుర్కొనాడు. వారి, ఈ శరీరము పాపిష్ఠియైనది మరియు ఆత్మ ఒకడు మరణించినప్పుడు అది వాని శరీరములో నుండి వెలుపలకి వెళ్లిపోవు ఒక విధమైన శక్తియై యున్నదని బోధించుచుండిన గ్రీకు తత్వశాస్త్రము చేత ప్రభావితులై యుందురు. ఈ శక్తి, ప్రకృతి శక్తిలోనికి లేక ఈ విశాల విశ్వమంతటిని చేసిన దైవములోనికి పున: అంతర్లీనమైపోవును. పౌలు కొరింథీయులకు చేసిన ప్రబోధములు, పునరుత్థానమును సంశయించు సద్దూకయ్యుల లేక ఇతరుల ఆలోచనలు తప్పని నిరూపించుచున్నవి.

పునరుత్థానము నందు విశ్వాసముంచని కొరింథు వాస్తవ్యులు, క్రీస్తు పునరుత్థానమును నిరాకరించలేదని స్పష్టమగుచున్నది, కానీ వారు ఎట్టకేలకు సంభవింపనై యుండిన వారి

పునరుత్థానమును ఒప్పుకొనలేదు. క్రీస్తు మృతులలో నుండి లేపబడనట్లయితే మనము కూడ లేపబడము; కానీ ఆయన లేపబడియున్నట్లయితే, మనము కూడ లేపబడుదుమని పౌలు చెప్పాడు (1 కొరింథీయులకు 15:12-19). పౌలు పునరుత్థానమును గూర్చి ఏడు అభిప్రాయములు వెలిబుచ్చాడు:

1. క్రీస్తు మృతులలో నుండి లేపబడినట్లయితే, కొరింథీలోని సహోదరులు క్రైస్తవులైనప్పుడు ఈ సత్యమును అంగీకరించినట్లుగా, వారు పునరుత్థానము లేదనలేరు.

2. క్రీస్తు మృతులలో నుండి లేపబడనట్లయితే, ఇతరులెవరైనను కూడ లేపబడలేరు. తరువాతి విషయములలో పౌలు ఈ అభిప్రాయమును అంగీకరించుటలో గల పరిణామములను తెలియజెప్పాడు.

3. క్రీస్తు లేపబడనట్లయితే, సువార్త ప్రకటన వ్యర్థమే, అది నిష్ప్రయోజకరమైన పనియే ఔతుంది.

4. క్రీస్తు మృతులలో నుండి లేపబడనట్లయితే, క్రీస్తు పునరుత్థానమునకు సాక్షులై యున్నారని చెప్పుకొనిన పౌలు మరియు ఇతరులందరును అబద్ధికులౌదురు.

5. క్రీస్తు మృతులలో నుండి లేపబడనట్లయితే, వారి విశ్వాసము అర్థరహితమైనదే. మరణించి తిరిగి లేపబడని వానియందు నిరీక్షణ కలిగియుండుట వలన ప్రయోజనమేమి? అందరూ మరణిస్తారు. యేసు మృతులలో నుండి లేపబడనట్లయితే, వారు కూడ రక్షకులే అని పిలువబడిన వారికిని ఈయనకును భేదమేమున్నది?

6. క్రీస్తు లేపబడనట్లయితే మనము యింకను మన పాపములలోనే నిలిచియుందుము మరియు రక్షణ నిరీక్షణ లేనివారమై యుందుము, ఏలయనగా మన పాపములను కడిగివేయుటకు ఆయన రక్తములో ఎటువంటి శక్తియైనను లేదు.

7. క్రీస్తు లేపబడనట్లయితే, అత్యంత కలవరమును కలుగజేయు పరిణామము, ఇదివరకే ప్రభువు నందు మృతినొందిన మృతులు కేవలము నశించిపోయినవారౌదురు - ఏలయనగా సమాధికి ఆవల నిరీక్షణ లేదు.

క్రీస్తు పునరుత్థానము గూర్చి ఎంతో బలముగా వాదించిన తరువాత, పౌలు మరొక గొప్ప సత్యమును వెల్లడించాడు, "ఈ జీవితకాలము మట్టుకే మనము క్రీస్తునందు నిరీక్షించువారమైన యెడల, మనుష్యులందరి కంటె దౌర్భాగ్యులమై యుందుము" (1 కొరింథీయులకు 15:19). "ఇప్పుడైతే నిద్రించినవారిలో ప్రథమఫలముగా క్రీస్తు మృతులలో నుండి లేపబడియున్నాడని" ఆయన ఘోషించాడు (1 కొరింథీయులకు 15:20).

## చచ్చినవాని భార్యను అతని సోదరుడో ఆ తరువాతి వారసుడో వివాహం చేసుకొను నియమము (22:23-28)

ఓనాను, యూదా కుమారులలో ఒకడు, జోక్యముగల సంఘటన, మోషే ఈ విషయమును ఆయనకియ్యబడిన ధర్మశాస్త్రములో చేర్చక మునుపే ఈ వాడుకను దేవుడు గౌరవించాడని సోదాహరణంగా చిత్రీకరించుచున్న ఒక ఉదాహరణమై యున్నది. ఓనాను చర్య, అనగా "తన అన్నకు సంతానము కలుగజేయకుండునట్లు తన రేతస్సు నేలను విడుచుట" (ఆదికాండము 38:8-10) దేవునికి అసంతుష్టి కలుగజేసినది గనుక దేవుడు అతనిని మొత్తెను.

ఈ వాడుక అభ్యసింపబడిన మరొక ఉదాహరణము రూతు గ్రంథములో కలదు. రూతు భర్త మహ్లోను, మరణించిన పిదప, రూతును వివాహమాడి బావమరిది ధర్మము నిర్వర్తించుటకు ఆమెకు కుమారులు లేరను వాస్తవము గూర్చి ఆమె యొక్క అత్తగారైన నయోమి విలపించినది (రూతు 1:11–13). ఎట్టకేలకు చివరకు, బోయజు, రూతు భర్తకు సమీప బంధువైనవాడు, రూతును వివాహమాడాడు. బోయజు రూతును వివాహమాడక మునుపు, ఆమెను భార్యగా పరిగ్రహించుటకు అతని కంటె మహ్లోనుకు సమీప బంధువులు ఇతరులెవరును లేరని రూఢిపర్చుకొన్నాడు. ఈ విషయము నిశ్చయము చేసికొనబడిన తరువాత, బోయజు రూతును వివాహమాడాడు (రూతు 4:1–10). ఇలా చేయడము ద్వారా, మోయాబీయురాలైన రూతు రాజైన దావీదు వంశస్థురాలయ్యింది, గనుక చివరకు యేసు క్రీస్తు వంశస్థురాలయ్యింది (రూతు 4:17, 22; మత్తయి 1:5, 6, 16).

పైన పేర్కొనబడిన నియమము క్రీస్తు కాలములో కూడా అమలులో కూడ ఉండినదో లేదో యని కొందరు వారి సందేహమును వ్యక్తము చేయుదురు. అయితే, అది అమలులో ఉండకుండుటకు సహేతుకమైన హేతువేదియును కనబడుట లేదు, మరియు సద్దూకయ్యులు ఈ నియమమును గౌరవించారు ఎందుకనగా వారి పంచగ్రంథములను వారు ఎంతో గౌరవించారు.[32]

## ప్రేమ (22:34–40)

యేసు మత్తయి 22:37–39లో రెండు గొప్ప ఆజ్ఞలను గుర్తించాడు. ఈ ఆజ్ఞల గూర్చి పరిశుద్ధ బైబిల్ ఎక్కువగా తెలియజెప్పుచున్నది (యెహోషువ 22:5; కీర్తనలు 31:23; యోహాను 14:15, 21, 23; రోమీయులకు 8:28; యాకోబు 1:12; 2:5; 1 యోహాను 4:8, 19, 21). ఈ రెండు ఆజ్ఞలలోను ముడిపడియున్నది. ప్రేమకు గల మూడు లక్షణములు చూద్దాము.

1. *ప్రేమ మనము నేర్చుకొనుచుండు విషయమై యున్నది.* మనము ప్రేమిస్తూనే పుట్టలేదు. ఇతరులను ప్రేమించవలెనను ఆజ్ఞ ఆ నాడు యేసు వెంట ఉండిన శ్రోతలకు వర్తించిన విధంగానే నేడు మనకు కూడ వర్తించుచున్నది.

2. *ప్రేమ మనము చేయుచుండు క్రియయై యున్నది.* అది ప్రేమపూర్వకమైన క్రియలను కల్పిస్తుంది. మన చర్యలు ప్రేమపూర్వకమైనవి కానప్పుడు, మన నోటి మాటలకు అర్థముండదు.

3. *ఈ లోకమునకు ప్రేమ ఒక్కటే మిగిలియున్న నిరీక్షణయై యున్నది.* మన ప్రపంచము ప్రేమను పునఃకనుగొనవలసిన పరిస్థితి నెలకొనియున్నది. లోకము యేసుక్రీస్తును ఎరుగవలసిన అవసరం ఎంతైనా ఉన్నది ఏలయనగా ఆయనే ప్రేమకు మూర్తిమంతమునై యున్నాడు.

## దావీదు కుమారుడు (22:41–46)

ఆయన మారువేషం ధరించిన మోసగాడని యేసు సమకాలీనులలో కొందరు అనుకొన్నారు. బాప్తిస్మమిచ్చు యోహానుకు వలెనే, ఆయన ఒక ప్రవక్త అని ఇతరులనుకొన్నారు. ఆయన చేసిన అద్భుతకార్యములనుబట్టి, ఆయన క్రీస్తు, దావీదు కుమారుడై యున్నాడని

అనేకులనుకొన్నారు. ఏది ఏమైనా, ఆయన పునఃరుత్థామునకు పూర్వము, ఆయన దేవుని దైవికమైన కుమారుడై యున్నాడని కొందరు మాత్రమే గ్రహించారు. యేసు, దావీదు వంశస్థుడైనప్పటికిని, ఆయన దావీదు కంటె ఎంతో గొప్పవాడని ప్రదర్శించాడు. వాస్తవమునకు, ఆయన దావీదునకు "ప్రభువై" యుండెను.

ఈ నాడు యేసును గూర్చి ప్రజల్లో నానా విధములైనా అనేక అభిప్రాయములున్నవి. ఆయన మోసగాడని కొందరు ఎంచుదురు. అందరి వలెనే ఆయన కూడ ఒక మంచి బోధకుడై లేక ఒక ప్రవక్తయై యుండెనని ఇతరులు అనుకొందురు. ఏది ఏమైనా, మనము మాత్రము ఆయనను క్రీస్తుగాను, ప్రభువుగాను అంగీకరించవలసినవారమై యున్నాము (అపొస్తలుల కార్యములు 2:36). ఆయన ఆది నుండి కూడ దేవునితో ఉండెను, ఆయన తానే దేవుడై యున్నాడు. ఆయన సృష్టి క్రమములో పాల్గొన్నాడు (యోహాను 1:1-5), మరియు కాలము సంపూర్ణమైనప్పుడు మనలను రక్షించుటకు శరీరధారి అయ్యాడు (యోహాను 1:14, 18; ఫిలిప్పీయులకు 2:6-11). ఆయన నిజముగా "ఇమ్మానుయేలు," "దేవుడు మనకు తోడు" అయియున్నాడు (1:23).

డేవిడ్ స్టూవర్ట్

---

సూచనలు

[1]పరిసయ్యులు రోమనులు ఆక్రమణమును వారికి జరగాల్సిన ఒక శాస్తిగానే అంగీకరించారు, కానీ వారు ఎవ్విధంగాను హేరోదీయులకు తమ మద్దత్తు పలుకలేదు. [2]యేసును వ్యతిరేకించునట్లు పరిసయ్యులు సద్దూకయ్యులతో ఏకమనస్కులయ్యారు (16:1పై గల వ్యాఖ్యానము చూడు). [3]Craig S. Keener, *A Commentary on the Gospel of Matthew* (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1999), 524, n. 200. Plutarch *Moralia* 48E-74E (*How to Tell a Flatterer from a Friend*) లో ముఖస్తుతి గూర్చి సవిస్తరంగా చర్చింపబడి యున్నాది. [4]Jack P. Lewis, *The Gospel According to Matthew,* Part 2, The Living Word Commentary (Austin, Tex.: Sweet Publishing Co., 1976), 100. [5]Josephus *Antiquities* 18.1.1; *Wars* 2.8.1. [6]Everett Ferguson, *Backgrounds of Early Christianity,* 2d ed. (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1993), 26. [7]Ibid., 86. [8]ప్రభుత్వ పరిపాలనా యంత్రాంగ సూత్రము దేవుడిచ్చినదే (దానియేలు 2:21, 37, 38; రోమీయులకు 13:1-7; 1 పేతురు 2:13-17). ప్రభుత్వము తరచుగా సైనిక కాపుదలను, రక్షకభట దళమును, మంచి రోడ్లను, మరియు న్యాయవిచారణా పద్ధతిని సమకూర్చును ఈ వ్యవస్థల నిర్వహణకు అవసరమగు ఆర్థిక వనరులను ప్రజలే సమకూర్చవలెను. [9]Leon Morris, *The Gospel according to Matthew, Pillar Commentary* (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1992), 557. [10]Lewis, 101.

[11]Josephus *Antiquities* 18.1.4. [12]Josephus *Wars* 2.8.14. [13]Mishnah *Sanhedrin* 10.1. [14]Tobit 3:7-9. [15]Lewis, 103. [16]Robert H. Mounce, *Matthew,* New International Biblical Commentary (Peabody, Mass.: Hendrickson Publishers, 1991), 209. [17]స్పష్టముగా, దేవదూతల గూర్చి పంచకాండములలో తరచుగా ప్రస్తావింపబడినప్పటికిని (ఆదికాండము 16:7; 19:1; 21:17; 22:11; 24:7; 28:12; 31:11; 32:1; 48:16; నిర్గమకాండము 3:2; 14:19; 23:20; 32:34; 33:2; హెూషేయ 20:16; 22:22), సద్దూకయ్యులు దేవదూతల విషయమును కూడ నమ్మలేదు (అపొస్తలులకార్యములు 23:8). [18]Talmud *Berakoth* 17a. [19]యోబు 14:14; 19:25-27; కీర్తనలు 16:9-11; 17:15; 49:15; 73:24-26; యెషయా 25:8; 26:19; 53:10; యెహోషువ 37:1-14; దానియేలు 12:1-3, 13; హోషేయ 6:2; 13:14. [20]Talmud *Sanhedrin* 90b.

[21]ద్వితీయోపదేశకాండము 32:39లో నుండి యూదా మత బోధకుల మరొక వాక్యభాగము ఉల్లేఖించుచున్నది, "మృతినొందించువాడను నేనే, బ్రతికించువాడను నేనే; నేనే గాయపరచాను, నేనే స్వస్థపరచుదును" అని దేవుడు సెలవిచ్చినట్లు అచ్చట వ్రాయబడి యున్నది (Talmud *Pesahim* 68a). [22]Bruce M. Metzger, *A Textual Commentary on the Greek New Testament,* 2d ed. (Stuttgart: German Bible Society, 1994), 48-49. [23]Talmud *Berakoth*

63a. [24]Talmud *Makkoth* 24a. [25]Pseudepigrapha లోని కొన్ని గ్రంథ పాఠములు కూడ దేవుని ప్రేమించుట మరియు పొరుగువానిని ప్రేమించుట గూర్చిన అభిప్రాయములను తెలుపుచున్నవి. (*Testament of Issachar* 5.2; 7.6; *Testament of Dan* 5.3.) [26]Talmud *Shabbath* 31a. [27]*Genesis Rabbah* 24.7. [28]Walter Bauer, *A Greek-English Lexicon of the New Testament and Other Early Christian Literature,* 3d ed., rev. and ed. Frederick W. Danker (Chicago: University of Chicago Press, 2000), 566. [29]Lewis, 107. [30]మత్తయి 26:64; మార్కు 12:36; 14:62; 16:19; లూకా 20:42, 43; 22:69; అపొస్తలుల కార్యములు 2:34, 35; 1 కొరింథీయులకు 15:25; ఎఫెసీయులకు 1:20, 22; కొలొస్సయులకు 3:1; హెబ్రీయులకు 1:3, 13; 10:12, 13; 12:2.

[31]ఒక ఉదాహరణము కొరకు, చూడు Alfred J. Hoerth, *Archaeology and the Old Testament* (Grand Rapids, Mich.: Baker Books, 1998), 213. [32]Mishnah లోని ఒక చిన్న ప్రబంధము *Yebamoth* సహోదరుని విధవరాలిని సమీప బంధువు వివాహము చేసికొనుట యను అంశమునకు అంకితము చేయబడి యున్నది.